క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

దహెగాం: జీవో 49ను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో బుధవారం మండలంలోని దిగిడ గ్రామంలో రాజ్‌గోండ్ సేవా సమితి నాయకులు సీఎం, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాబురావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ జీవోను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయిసెంటర్ సార్మెడీ కనక శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు జనార్దన్, రాయ్ యజమాని సుగుణయ్య, తిరుపతి, రమేశ్, సాంబయ్య, శంకర్, సంజీవ్ పాల్గొన్నారు.

బోనాల సంబరాలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యార్థులు అమ్మవారి, పోతురాజు వేషధారణ అలరించాయి. ప్రిన్సిపాల్ భద్రయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీ లో అసిస్టెంట్ కుక్, అటెండర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో శివచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి అటెండర్ కోసం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, అసిస్టెంట్ కుక్ కోసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25 నుంచి 28వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం కేజీబీవీ పాఠశాల ప్రత్యేకాధికారిని సంప్రదించాలన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: పింఛన్‌దారులు, ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలు, బకాయిలు వెంటనే చెల్లించాలని రాష్ట్ర సీనియర్ సిటీజన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ విలేకరులతో మాట్లాడారు. పింఛన్ దారులకు రావాల్సిన బకాయిలు సకాలంలో రాకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే 5 డీఏలు బకాయిలు పడిన రాష్ట్రంగా మన రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో నాయకులు మురళీధర్‌రావు, నారాయణ, కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, నర్సయ్య, కిషన్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

కౌటాల: మండల మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, బెజ్జూర్ సహకార సంఘం మాజీ చైర్మన్, టీపీసీసీ సభ్యుడు అర్షద్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీని వీడి బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎన్నికల్లో సిర్పూర్‌లో గులాబీ జెండా ఎగుర వేయాలని, కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కౌటాల, బెజ్జూర్ మండలాల నుంచి పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు లెండుగురే శ్యామ్‌రావు, నాందేవ్, నవీన్, బండు, సోమయ్య, కార్తీక్, ప్రకాశ్, జనార్దన్, ఏమాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పంటలు..!



గోలేటి శివారులో పత్తి పంట

- మొదలైన వరిసాగు పనులు
- చెరువులు, కుంటలకు జలకళ

రెబ్బెన: జిల్లాలో విస్తారంగా వర్షాలు పడుతుండటంతో పంటల సాగు ఆశాజనకంగా మారింది. పత్తి పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షం మరింత అనుకూలంగా మారుతున్నాయి. జూన్ మొదటి వారంలో మండలంలోని రైతులు పత్తి విత్తనాలు విత్తుకోగా ప్రస్తుతం పంటలు రెండోదఫా ఎరువులు అందించే స్థాయికి చేరుకున్నాయి. అనుకూలంగా వర్షాలు పడుతుండటంతో మొక్కలు కావాల్సిన ఎరువులు, తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారి చేస్తూ రైతులు పంటలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

పత్తి సాగే అధికం..

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఈసారి సైతం పత్తి పంట సాగుకే రైతులు జై కొట్టారు. మండలంలో ఆశించిన స్థాయిలో సాగు నీటి వనరులు లేకపోవడంతో రైతులు ప్రధాన వర్షధార పంట పత్తి సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. మండలంలో 28,500 ఎకరాల వరకు పత్తి, పత్తిలో అంతర పంటగా కంది సుమారు 700 ఎకరాల వరకు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇక వరిసాగు ఇప్పుడే ప్రారంభం కాగా సుమారు 6వేల ఎకరాల వరకు సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు.

ఆయకట్టు కింద వరినాట్లు..

మండలంలో వరిసాగుకు సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులు కుంటలు, చెరువుల కిందే అధికంగా వరిసాగు చేపడుతుంటారు. సీజన్ మొదట్లో పత్తి పంటలకు మాత్రమే అనుకూలంగా వర్షాలు పడటంతో చెరువులు, కుంటల కింద వరిసాగు కోసం ఎదురుచూసే రైతులు ఆందోళన చెందారు. అయితే గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలకు భారీగా వరదనీరు వచ్చి చేరడంతో జలకళ సంతరించుకుంది. దీంతో ఆయకట్టు కింద నార్లు పోస్తున్నారు. బోరు బావులు, వాగులకు ఆనుకుని పంట పొలాలు ఉన్న రైతులు ఇప్పటికే వరినాట్లు సైతం పూర్తి చేశారు. చెరువులు, కుంటల్లోకి కాస్త ఆలస్యంగా నీరు రావడంతో గత వారం రోజుల నుంచి రైతులు నార్లు పోస్తున్నారు. మరో 20 రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో వరినాట్ల ప్రక్రియ జోరుగా సాగనుంది.

అనుకూలంగా వర్షాలు



ప్రస్తుతం మండలంలో సాగవుతున్న పత్తి పంటలకు వర్షాలు అనుకూలంగా పడుతున్నాయి. పత్తి పంటలు 5వారాల దశకు చేరుకున్నాయి. తెగుళ్ల కూడా సోకడం లేదు. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలతో పంటల్లో ఆకు ముడత, దోమ పెరిగే అవకాశాలు ఉన్నాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే ఈసారి మంచి దిగుబడి వస్తుంది.

– దిలీప్‌కుమార్, మండల వ్యవసాయాధికారి

జోరుగా వరినాట్లు..!



వరి నాట్లు వేస్తున్న కూలీలు



పొలాన్ని చదును చేస్తున్న ట్రాక్టర్



వరి నారు తీస్తున్న కూలీలు

గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున వరి నాట్లు జోరందుకున్నాయి. దహెగాం మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ తదితర గ్రామాల్లో వరి సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచే ముసురు వర్షం కురుస్తున్నా కూలీలు కవర్లు కప్పుకొని నాట్లు వేశారు. వరి నాట్లకు కూలీల కొరత సైతం ఏర్పడుతుందని రైతులు పేర్కొన్నారు. సాగు పనులు ముమ్మరం కావడంతో కేజీవీల్స్‌కు సైతం డిమాండ్ పెరిగింది. మండల వ్యాప్తంగా 9,800 ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు అంచనా.

– దహెగాం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కెరమెరి: వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ పోరాట కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ మధుకర్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జిల్లా నాయకులు వైద్య శాంతి కుమారి, జాడి కేశవులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలు ఈ నెల ఆఖరులోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని, 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని పేర్కొన్నారు. విద్యారంగంలో ఎన్జీవోల జోక్యం నివారించాలని, అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్లు విడుదల చేయాలనే డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రీతి, సురేందర్, అంజయ్య, శ్రీధర్, ప్రేంసాగర్, రవీందర్, విజయ్, పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూపీఎస్‌సీ) ఆధ్వర్యంలో తహసీల్దార్ రియాజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. హేమంత్, రమేశ్, కిరణ్ కుమార్, రవి కుమార్, తిరుపతి, కిషన్, సంతోష్, బాదిరావు పాల్గొన్నారు.

కెరమెరి: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు సమ్మయ్య అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎస్‌ఏ సేవంతకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు సమ్మయ్య, మొహినోద్దీన్, విటోబా, నరేశ్, మహేశ్, అశ్విన్, గోపాల్, సంతోష్, హరీశ్, హన్మంతు తదితరులు ఉన్నారు.

వాంకిడి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కవితకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. నాయకులు దుర్గయ్య, సాయి కుమార్, రాజలింగు, మహేందర్, నాగేందర్, కేశవ్‌రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ రుణం వడ్డీ చెల్లించాలి

రెబ్బెన: సింగరేణి కార్మికుల గృహ రుణానికి సంబంధించిన వడ్డీని జూలై వేతనంతో కలిపి చెల్లించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. కేసీఆర్ కృషితో సింగరేణి కార్మికులు ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న రుణంలో రూ.10లక్షలకు సంబంధించిన వడ్డీని తిరిగి కార్మికులకు చెల్లించేలా పథకాన్ని రూపొందించి అమలు చేశామని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు వడ్డీ చెల్లించలేదన్నారు. సింగరేణి యాజమాన్యం జూలై వేతనంతో కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ నాయకులు సమ్మయ్య, ఆఫీస్ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

‘317 జీవో బాధితులకు న్యాయం చేస్తాం’



మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లాలో 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని పీఆర్‌టీ యూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం కెరమెరి ఎంఈవో ఆడే ప్రకాశ్ పీఆర్‌టీయూలో సభ్యత్వం తీసుకున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్‌సీతోపాటు పెండింగ్ బకాయిలు సాధిస్తామన్నారు. సమగ్ర శిక్ష సిబ్బంది, ఐటీడీఏ సీఆర్‌టీలకు మినిమం టైంస్కేల్ అమలుకు కృషి చేస్తామని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి రెమ్యునరేషన్, డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాస్, కార్యదర్శి అనిల్‌కుమార్, మండల బాధ్యులు రవీందర్, శివకుమార్, అజయ్, నరసింహచారి, శ్రావణ్‌కుమార్, రమేశ్, దత్తు, భూమన్న, రవీందర్, సోము, లెవన్‌కుమార్, భాస్కర్, భరత్, వసంత్, నందిని, శుభాంగి, మౌనిక పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాలు మావే..

- వివాదానికి తెరదించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి

కెరమెరి(ఆసిఫాబాద్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని 14 వివాదాస్పద గ్రామాలు కెరమెరి మండలానికే చెందుతాయని, వెంటనే వివాదానికి తెరదించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. వివాదం సుప్రీం కోర్టులో కొనసాగుతుండగా మహారాష్ట్ర ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకుంటుందని ప్రశ్నించారు. ఈ విషయంపై తగిన నివేదిక మహారాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో కెరమెరి మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, మాజీ సర్పంచ్ పరమేశ్వర్, నాయకులు ఆత్రం బొజ్జిరావు తదితరులు ఉన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్అర్బన్: భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైతే తప్పా బయటికి రావొద్దని సూచించారు. సరఫరాలో అంతరాయం ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు, విపత్తు సహాయక బృందాలను సంప్రదించాలని సూచించారు.

రెగ్యూలర్ వైద్య సిబ్బందిని నియమించాలి

కెరమెరి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రెగ్యూలర్ వైద్య సిబ్బందిని నియమించాలని మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేశ్, సీఐటీయూ మండల కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు అన్నారు. బుధవారం పీహెచ్‌సీని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఆస్పత్రిలో సరిపడా మందులు ఉండేలా చూడాలన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



దహెగాం: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా అధికారులు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను బుధవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులకు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఏవో మనీషా, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, నాయకులు నగేశ్, గణపతి, భీమయ్య, కిరణ్, పురుషోత్తం, సంతోష్, శోభన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ..

దహెగాం: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను రైతువేదికలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోత్మీర్ నుంచి దహెగాం వరకు మంజూరైన డబుల్ రోడ్డు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ నత్తనడకన చేపడుతున్నందున కాంట్రాక్టర్‌ను తొలగించి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలన్నారు. సహకార సంఘం చైర్మన్ కొండ్ర తిరుపతి గౌడ్, తహసీల్దార్ మునవార్ షరీఫ్, వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి..

పెంచికల్‌పేట్: స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ స్థానికసంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల బీజేపీ ఇన్‌చార్జీ కొంగ సత్యనారాయణ, నాయకులు చప్పిడే సత్యానారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు కుకిడే రాజేశ్వర్, ఘణపురం నగేశ్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



దహెగాం: మాట్లాడుతున్న సుంకరి సాయికృష్ణ

దహెగాం: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు మండలంలో విద్యాసంస్థల బంద్ సంపూర్ణమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకరి సాయికృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. తిరుపతి, అనిల్, అంజన్న, హరీశ్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. పట్టణంలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాప్లె సాయికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా విద్యారంగానికి మంత్రిని కేటాయించకపోవడం దారణమన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కొట్రంగి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: విద్యాసంస్థల బంద్ బుధవారం మండలంలో విజయవంతమైందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలలను మూసివేయించారు.

ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ప్రారంభం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని హీరాపూర్‌లో ఎంపీ నిధులతో మంజూరైన ఎల్ఈడీ విద్యుత్ దీపాలను బుధవారం బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో హీరాపూర్ గ్రామంలో పర్యటించిన సందర్భంలో గ్రామంలో విద్యుత్ దీపాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే ఎంపీ నగేశ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఎల్ఈడీ విద్యుత్ దీపాలకు నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే రూ. 40లక్షల నిధులతో పట్టణంలోని కూడళ్ల వద్ద ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాది పంచదార దీపక్‌రావ్, నాయకులు ఎగ్రస్ శ్రీకాంత్, కాలనీవాసులు చందు, వాసుదేవ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలంతో కలిసి మండలస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి రుకుం ప్రహ్లాద్, ఉపాధ్యక్షుడు వెంకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాటూరి జయరాజ్, నాయకులు ఉప్పరి ప్రభాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

భారీ వర్షం..



పెంచికల్‌పేట్: బొక్కివాగు ప్రాజెక్టు మత్తడి



పెంచికల్‌పేట్: లోడుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఒర్రె

జిల్లాలో బుధవారం ఎడతెరిపి లేని భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దవాగు, బొక్కివాగు, ఉప్పమల్లవాగు, ఒర్రెలు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద ప్రవాహంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్టులోకి వరద పోటెత్తింది. భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రజలకు సూచించారు. – సాక్షి నెట్‌వర్క్



కౌటాల: వర్షానికి ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం



చింతలమానెపల్లి: గూడెం గ్రామం శివారులో నీట మునిగిన పంట భూములు



బెజ్జూర్‌లో వాగు పరిశీలిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు

వసతి గృహాల్లో మెనూ పాటించాలి

వాంకిడి: సంక్షేమ వసతి గృహాల్లో తప్పనిసరిగా మెనూ పాటించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పరిసరాలు, వంట గది, తరగతి గదులు, ఆహారంలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎస్‌వో మీన, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కౌటాల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

సావంతా మాలి మహరాజ్ వర్ధంతి

వాంకిడి: మండలంలోని తేజిగూడ గ్రామ శివారులో గల శ్రీకృష్ణ ఆలయంలో మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సావంతా మాలి మహరాజ్ 729వ వర్ధంతి నిర్వహించారు. ఆయనకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మాలి కులంలో పుట్టి వ్యవసాయం చేసుకుంటూ భజనలు, కీర్తనలు స్వతహాగా రచించి తన భక్తిని చాటిన గొప్ప వ్యక్తి అని అన్నారు. మాలి మహాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నులె నారాయణ, జిల్లా అధ్యక్షుడు గుర్నులె మెంగాజీ, నాయకులు నగోషె శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు దుర్గం జీవన్, దుర్గం ప్రశాంత్, వడై పాండు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద పెంచాలి

కౌటాల: రైతులు పశు సంపదను పెంచి ఆర్థికంగా వృద్ధి చెందాలని కాగజ్‌నగర్ మా ర్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య అన్నారు. కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కన్నెపల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.

‘పొలం బాట’ సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ శేషారావు

రెబ్బెన: వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఏర్పడే సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ శేషారావు అన్నారు. రెబ్బెన సబ్‌స్టేషన్ పరిధిలోని రెబ్బెన సెక్షన్‌లో బుధవారం రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి వాటిని వినియోగించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇబ్బందులు ఉంటే సిబ్బందికి తెలియజేయాలన్నారు. రైతులు మరమ్మతులు చేయొద్దని సూచించారు. ఏడీఈ ఫిరోజ్, ఏఈ ఇమ్రాన్, ఫోర్‌మెన్ రమేశ్, సిబ్బంది లక్ష్మణ్ ఉన్నారు.